

# టేకిట్ ఈజీ!!

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

## బేమ్మడూ...నల్ల మేకా

**పాట** వచ్చిన వాడూ, పెళ్ళాం పక్కనే ఉన్నవాడూ ఊరికే ఉండలేడని సామెత. అల్లాగే, కథ రాయడం వచ్చనుకునేవాడూ ఓ పట్టాన ఊరికే ఉండలేడు. ఏదో ఒహటి గొలకకపోతే వాడికి పొద్దుపోదు, నిద్దర్రాదు. శ్రీకాందీ అదే పరిస్థితి. పక్కమీద కాసేపు అటూ ఇటూ దొర్లి, నిద్ర పట్టక, కాగితాలూ, కలం తీసుకుని తన గదిలోకెళ్ళి కూర్చుని ఏదో రాయడం మొదలెట్టాడు. కాసేపటికి వెనకాల అలికిడైతే గబుక్కున వెనక్కి తిరిగి చూసాడు, కొంపతీసి సరస్వతీదేవి ఏవన్నా ప్రత్యక్షమైపోయిందేమోనని. తీరాచూస్తే సీతాలు, అంటే వాళ్ళావిడ.

"మళ్ళీ మొదలెట్టారా, దిక్కుమాలిన కథలూ మీరూ?" అంది విసుగ్గా చూస్తూ.

"అది కాదే, ఏదో నిద్ర పట్టకపోతే మొదలెట్టా.."

"మొన్నటికి మొన్న ముక్క చీవాట్లు తిన్నారు, అయినా బుద్ధి రాలేదా మీకు..?"

"ఎవరిగురించీ చెబుతూంట?"

"అదే, క్రితం సారి రాసిన కథ మీద కొంతమంది నానా చెవాకులూ రాసారుగా, కడుపు నిండలేదా?"

"ఓహో..అదా, ఆ విషయం నేనెప్పుడో మర్చిపోయా, అయినా వాళ్ళంతా మంచి వాళ్ళు. వాళ్ళు రాసింది నా "కథ" నచ్చక కాదు, బేసిక్‌గా నేను నచ్చక.."

"మీరేవనుకున్నా ఫరవాలేదు. నాకు వళ్ళు మండుకొస్తోంది, మీ కథలూ మీరూ. రాస్తే రాసారు గానీ, ఇంక ఎవ్వరికీ పంపించకండి."

"ఎవరికీ పంపించకపోతే ఎలా? కనీసం కొంతమందైనా చదవాలిగా?"

"అవునవును, చదవాలి, తిట్టాలి, వెక్కిరించాలి. వాళ్ళు తిట్టా, మీరు వాటన్నిటికీ సమాధానాలు చెప్పా, ఎందుకొచ్చిన టైము దండగ పనులంటాను. హాయిగా ఓ పాట పాడుకోండి, లేకపోతే చెస్సు ఆడుకోండి, ఎవరికీ ఏ గొడవా ఉండదు"

"మరీ అలా ఊరికే ఇదైపోకు. అక్కడికీ కొంతమంది నచ్చిందనే రాసారుగా. అయినా విమర్శా అన్నాకా మంచీ చెడ్డా అన్నీ ఉంటాయి. కొంతమందికి కథ నచ్చదు, కొంతమందికి మనం నచ్చం. ఫేస్ వాల్యూ అన్నమాట. కాబట్టి అలా రాస్తారు, వాళ్ళేదో అన్నారని మనం రాయడం ఆపేస్తే ఎలా?"

"అవును, మీరు రాయకపోతే తెలుగు సాహిత్యానికి చాలా ద్రోహం జరిగిపోతుంది, పైగా రేపో మాపో మీకు సాహిత్య అకాడమీ ఇస్తారని అనుకుంటున్నార్ట కూడానూ, మీరు రాయకపోతే ఎలా? " అంది వెటకారంగా.

"మరదే, నువ్వు లక్ష చెప్పు, నేను రాయకుండా ఉండలేను, రాయకపోతే మన మనసులో ఉన్నది నలుగురితో పంచుకోవడం ఎలా?"

"సరే, రాస్తే రాసారు గానీ, చక్కగా ఏ గొడవా లేని సబ్జెక్టులమీద రాయండి, మీ కోనసీమ గురించో, ఏ పండగల గురించో, లేకపోతే మీ చిన్ననాటి కబుర్ల గురించో.."

"ఎప్పుడూ అవే రాయకూడదు. మనకి ఏ అంశం మీద రాయాలనిపిస్తే దానిమీద రాసేయాలి, భయపడకూడదు."

"మీరో మొండిఘటం. ఈ సారి మాత్రం వేశ్యలూ, మొగుడూ పెళ్ళాల గొడవలమీద రాస్తే నేనొప్పుకోనంతే.."అంది పేపర్లు లాక్కుంటూ.

"సరే, సరే. మరి దేనిమీద రాయమంటావు?` అన్నాడు నవ్వుతూ.

"చక్కగా, అప్పుడే పెళ్ళై, అన్యోన్యంగా కాపురం చేసుకుంటున్న కొత్త జంటమీద రాయండి, ఎవరికీ ఏ గొడవా ఉండదు.."

"ఓ పిచ్చిపిల్లా.., అల్లా రాసినా కూడా విమర్శలు వస్తాయి, చూస్తావా?"

"ఏమీరావు, కావలిస్తే పందెం.."

"ఎంత"

"వంద డాలర్లు..".

శ్రీరాం కథరాసేసాడు. కాస్త వినిపించమంది సీతాలు. వినిపించాడు......

శాస్త్రీ, స్వప్నా కొత్త జంట. ఆరోజు శాస్త్రి ఇంటికొచ్చేసరికి కాస్త లేటయ్యింది. ఆఫీసులో పని వత్తిడివల్ల కాస్త తలనొప్పికూడా వచ్చింది. ఇంటికి వచ్చి సోఫాలో కూలబడ్డాడు. స్వప్న కాఫీ ఇచ్చింది. తాగుతూ అన్నాడు, "ఆఫీసులో పిచ్చెక్కించేస్తున్నారు పిల్లా , ఒకటే తలనొప్పి, సరేగానీ, మధ్యాన్నం ఫోను చేస్తే ఎత్తలేదు, ఎక్కడికెళ్ళావు?".

"ఎక్కడికీ లేదండీ, అన్నపూర్ణ వచ్చింది, ఇవాళ శ్రావణ శుక్రవారం కదా వాయనం ఇవ్వడానికి. సరే తనతో మాట్లాడుతున్నాను కదా అని ఫోను తియ్యలేదు, తరవాత నేనే చేద్దామనుకుని మర్చిపోయా టీ.వీ చూస్తూ" అంది..

"హమ్మయ్య, ఈ కథ పరవాలేదు, పంపించేయండి, చూద్దాం"

"కథ పూర్తిగా వినవా?"

"అక్కర్లేదు, దీనిలో కాంట్రావర్సీలేమీ కనబడటంలేదు, ఇంతకు ముందు కథమీద ఇది మెరుగ్గా ఉంది, పంపించేయండి, ఇంక నాకు నిద్దరొస్తోంది" అంటూ వెళ్ళి పడుకుంది.

కథ మొత్తం మరోసారి చదివాడు శ్రీరాం. అతనికి అంతగా నచ్చలేదు. ఏదో రాసామంటే రాసామన్నట్టుగా ఉంది. అయినా అన్యమనస్కంగానే పంపించేసాడు. మూడు రోజుల తరవాత సంపాదకుడి దగ్గర్నుంచి సమాధానం వచ్చింది. "అయ్యా, ఈ కథలో

ఏవిధమైన ట్విష్టూ లేదు. ఇల్లాటి కథలు గతంలో చాలా వేసుకున్నాము. కేవలం మిమ్మల్ని ప్రోత్సహించే సదుద్దేశ్యంతో ఈ కథ వేసుకుంటున్నాము. ఇకపైన ఎప్పటిలాగే మంచి కథలు రాస్తారని ఆశిస్తున్నాము."

సరే, కథ అచ్చయింది. తొలినాడే బోలెడు విమర్శలు వచ్చాయి. ఆ రోజు రాత్రి భార్యతో కలిసి నవ్వుతూ చదువుతున్నాడు విమర్శలన్నీ...

**మొదటి విమర్శ :**

అబ్బెబ్బెబ్బెబ్బే, ఇదో కథా ? వీడో రచయితా ? "శాస్త్రి, స్వప్న"..నా మొహంలా, ఏడిసినట్టున్నాయి పేర్లు. హాయిగా నాలాగ యే "వనమాలి, సుకుమారి" అనో పెట్టుంటే కథ రక్తి కట్టి వుండేది (????) కథ రాయడం రాకపోతే, నాలాంటి వాళ్ళని అడిగైనా తెలుసుకోవాలి...

**రెండవ విమర్శ :**

కథ...ఏ..దో..చల్తాహై. ఇంకు పెన్ను వాడుంటే ఇంకా బాగా రాయచ్చు. ఇంకా బాగా రాసుంటే, ఇంకా బాగా వచ్చేది (???)

**మూడవ విమర్శ :**

రాత్రి వంటకి వంకాయలు తీసుకురమ్మని చెబుతూ, పాలల్లో పంచదారకి బదులు పాయిజన్ కలిపేసింది స్వప్న. కాఫీ తాగేసి శాస్త్రి టపా కట్టేసాడు. పాపం, వంకాయకూర లేకుండానే స్వప్న రాత్రి భోజనం కానిచ్చేసింది..

**నాలుగవ విమర్శ :**

"ఒరి వీడి జిమ్మడిపోనూ...."

సారీ, ఈ దీవెనలన్నీ కేవలం కథలోని పాత్రలకే. ముఖ్యంగా **"రచయితకి"** ఎంతమాత్రం కావు, కావుకావుకావు, అని గమనించగలరు.

మొదటి పాత్ర పేరు శాస్త్రి అట. కేవలం అగ్రకులాలమీద దురభిమానంతో పెట్టుకున్న పేరిది. చక్కగా ఏ సురేష్ అనో, మహేష్ అనో పెట్టుకుంటే, కనీసం కథ చదవబుద్ధన్నా అయ్యేది. వీడు ఆఫీసులో అలిసిపోయి ఇంటికొచ్చాడుట. వీడి పెళ్ళాం కాఫీ కప్పు అందించిందట. వీడో పురుషాహంకారి. పైగా భార్య మధ్యాన్నం ఫోను ఎత్తలేదని సంజాయిషీ అడిగే అనుమానప్పిశాచి, అంట్ల వెధవ. ఇల్లాంటి నెలతక్కువ్వెధవల్ని తన్ని తగలెయ్యాలి. ఏరా, నీ పెళ్ళం ఉద్యోగం చేసి, నువ్వు ఇంట్లో అఘోరిస్తే, ఆవిడకి తలనెప్పొస్తే, నువ్విల్లాగే కాఫీ అందిస్తావురా? అని కాలరు పట్టుకుని అడగాలి ఇల్లాంటి వాళ్ళని. పైగా అనుమానాలు కూడాను. ఇదీ ఒక పాత్రేనా?

ఇక స్వప్న పాత్ర. ఆడవాళ్ళంటే కేవలం ఇంటికే పరిమితమవ్వాలన్నట్టుగా తయారు చేయబడ్డ పాత్ర ఇది. మొగుడింటికొస్తే వాడికి కాఫీకప్పుతో ఎదురెళుతుందిట ఈవిడగారు. పైగా వ్రతాలూ, వాయనాలూట. ఈ దుష్ట సంస్కృతులని ప్రతిబింబించే రచయితలున్నంతకాలం సమాజం బాగుపడదు. ఛీ..ఛీ..ఛీ.., కథ చదివితేనే కడుపులో తిప్పేసింది.

ఇక అన్నపూర్ణ పాత్ర గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఈవిడకి వాయనాలూ, వాసెనపోలెలే తప్ప వ్యక్తిత్వం లేదు. ఇల్లాంటి పరమ నీచ, నికృష్టమైన కథలు ఎల్లా ప్రచురిస్తున్నారో, పైవాడికే తెలియాలి....

పన్నెండో విమర్శ :

నాలుగో విమర్శగారూ, అయ్‌బాబోయ్, మీరు టూమచ్చండీ బాబూ, అద్దరగొట్టేసారు. అసలు ఈ కథ ఎంత దరిద్రంగా ఉందో మా భలేగా చెప్పారు. ఇకపై నేను రాసే కథలన్నీ ఎందుకు పరమ చెత్తగా ఉంటాయో చెబుతూ, ఇల్లాగే ఉతికారేసి, చెంబిస్త్రీ చేసేయండి. మీతిట్లే మాకు దీవెనలు. మీరు మా యింటికొచ్చి, నాలుగు తన్నులు తన్ని, చెవి మెలేసి, గోడకుర్చీ వేయిస్తే, ఇంకా బావుంటుంది.

ఇరవయ్యో విమర్శ :

కథలో శాస్త్రికి లాగానే మాక్కూడా తలనెప్పి వచ్చింది ఈ కథ చదివాకా.. కానీ, కథ కన్నా, కామెంట్లు చదివితే పొట్టచెక్కలైపోయింది. సంపాదకులకు చిన్న సూచన: అసలు శ్రీరాం అని పేరుపెట్టుకున్న వాళ్ళెవరూ కథలు రాయకూడదు, బావుండదు (????)

ఒక్కసారి అదిరిపోయింది సీతాలు. "ఇదేవిటండీ, చక్కగా మొగుడూ పెళ్ళాం కాపురం చేసుకుంటున్నారని రాసినా వీళ్ళకి నచ్చలేదేవిటీ? ఇదిగో మీ వంద, తీసుకోండి. పోనీ, వాళ్ళకి నచ్చినట్టుగా మార్చి రాయండి కథని. అప్పుడన్నా ఈ తిట్లు ఆగుతాయేమో చూద్దాం.." అంది.

"నీ మాటెందుక్కాదనాలీ" అంటూ అతను నవ్వుతూ కథ తిరగరాసేసాడు. కొత్త కథ ఇల్లా వుంది..

జయ ఆఫీసునించి లేటుగా ఇంటికొచ్చింది. భర్త అడిగితే ఏం చెప్పాలా అని ఆలోచించింది. అతను అడిగితే తను సంజాయిషీ చెప్పుకోవలసిన ఖర్మ తనకింకాపట్టలేదు. ఏదో, ఆఫీసయ్యాకా కొలీగు టెన్నీసు ఆడదామంటే, ఆడి వచ్చింది, అందుకే లేటయ్యింది. టెన్నీసు ఆడాలా, వద్దా, ఎవరితో ఆడాలి, అనేవి తన వ్యక్తిగత విషయాలు, అవి గౌతంకి అనవసరం, అతను కేవలం తనకు భర్త మాత్రమే. తనమీద అధికారాలు ఎవ్వరికీ లేవు, తనకి తప్ప. గౌతం తలుపు తీసి కాఫీ ఇచ్చాడు.
తాగుతూ అడిగింది 'మధ్యాన్నం ఫోను కూడా ఎత్తలేదు, ఏవిటా బోడి బిజీ?"

"ఏవీలేదు, పక్కింటి రంగేష్ వచ్చాడు, ఎల్లుండి వాళ్ళబ్బాయికి రిజిష్టాఫీసులో పెళ్ళిట. నన్ను సాక్షి సంతకానికి రమ్మన్నాడు. ఖర్చెక్కువౌతుందని నిన్ను రావద్దని మరీ మరీ చెప్పాడు. వాడితో మాట్లాడుతూ ఫోను ఎత్తలేకపోయాను.."

"వెరీ గుడ్ తప్పకుండా వెళ్ళిరండి. దుబారా ఖర్చులు చెయ్యద్దని చెప్పండి. హనీమూన్‌కి కావలిస్తే మన బెడ్‌రూం వాడుకోవచ్చని చెప్పండి, ఒక్కరోజుకి మనం బయట పడుకుందాం"

కథ పంపించేసాడు. కొన్నాళ్ళపాటు అవుననీ, కాదనీ, ఏ సమాధానమూ రాలేదు. ఓ నెల పోయాకా ఒక ఈ మెయిలు వచ్చింది సంపాదకుల దగ్గరినించి, దాన్లో ఒకేముక్క ఉంది..

**"మీ నల్లమేక పరమపదించినందుకు మా ప్రగాఢ సానుభూతులు.."**

చూసి నవ్వుకున్నాడు శ్రీరాం.

హాయిగా నవ్వుకుని, మరో కథకి అంకురార్పణ చేయసాగాడు.

